22-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 16-02-96
మధువనం

"డైమండ్ జూబ్లీ సంవత్సరములో విశేష అటెన్షన్ పెట్టి సమయము మరియు సంకల్పాల ఖజానాను జమ చేసుకోండి"

ఈ రోజు త్రిమూర్తి రచయిత అయిన శివబాబా పిల్లలకు మూడు శుభాకాంక్షలను ఇస్తున్నారు. పిల్లలు తండ్రికి శుభాకాంక్షలను తెలియజేయడానికి వచ్చారు, దానికి రిటర్న్ లో తండ్రి మూడు శుభాకాంక్షలను తెలియజేస్తున్నారు. ఒకటి - శివ జయంతికి, రెండు - డైమండ్ జూబ్లీకి మరియు మూడు - వర్తమాన సమయములో ఉల్లాస-ఉత్సాహాలతో సేవ చేసినందుకు శుభాకాంక్షలు. ఈ మూడు శుభాకాంక్షలను బాప్ దాదా నలువైపులా ఉన్న పిల్లలకు ఇస్తున్నారు. అందరి హృదయాలలోని ఉల్లాస-ఉత్సాహాలతో చేసిన సేవా సమాచారాలు తండ్రి వద్దకు చేరుకుంటూ ఉంటాయి. ఈ అలౌకిక జయంతి మొత్తము కల్పములో మరెప్పుడూ జరగదు ఎందుకంటే మొత్తము కల్పములో దేవాత్మలైనా, మహాత్ములైనా లేక సాధారణ ఆత్మలైనా, ఆత్మలు ఆత్మ జయంతిని జరుపుతారు. కానీ ఈ సంగమయుగములో శ్రేష్ఠ ఆత్మలైన మీరు ఎవరి జయంతిని జరపటానికి వచ్చారు? పరమ ఆత్మ జయంతిని జరపటానికి వచ్చారు మరియు తండ్రి అయిన పరమ ఆత్మ పిల్లల జయంతిని జరుపుతారు. సత్య, త్రేతాయుగాలలో కూడా పరమ ఆత్మ మీ జయంతిని జరపరు లేక మీరు పరమాత్మ జయంతిని జరపరు. కావున మీరు ఎంత పదమా, పదమా, పదమాల రెట్ల భాగ్యవాన్ ఆత్మలు. ఇటువంటి మీ శ్రేష్ఠ భాగ్యము గురించి కలలోనైనా ఆలోచించి ఉంటారా? ఆలోచించలేదా? కానీ ఈ రోజు సాకార రూపములో జరుపుకుంటున్నారు. అందుకే సంతోషంగా ఉంది కదా! చూడండి, ఈ దేశం వారైనా, విదేశాల వారైనా, మధుబన్ వారైనా, ఎవరెవరైతే ఈ గ్రూపులో కూర్చున్నారో వారు ఎంత అదృష్టవంతులు! లోలోపల ఏ పాటను పాడుతారు? వాహ్ నా భాగ్యము! మరియు తండ్రి కూడా వాహ్ పిల్లల భాగ్యము అనే పాటను పాడుతారు! విశేష సేవ యొక్క గ్రూపు కూర్చున్నారు, అన్ని వైపుల యొక్క విశేషమైనవారు ఉన్నారు కదా! మీరు విశేష సేవకు విశేష ప్రత్యక్ష ఫలాన్ని ప్రాప్తి చేసుకునే ఆత్మలు. తండ్రి కూడా అటువంటి శ్రేష్ఠ పిల్లలను చూసి హర్షిస్తారు. పిల్లలు ఎక్కువ హర్షిస్తారా లేక తండ్రినా? ఇరువురూ. లేక తండ్రి ఎక్కువ హర్షిస్తారా? మీరు ఎక్కువ హర్షిస్తారు. అచ్ఛా!

ఈ రోజు బాప్ దాదా నలువైపులా ఉన్న సేవాధారీ డైమండ్ల యొక్క మాలను చూస్తున్నారు. మీరందరూ మాలలో ఉన్నారు కదా? తండ్రి మెడలో డైమండ్లుగా అయి మెరిసే మాలలోని మణిపూసలు మీరేనా లేక అది ఇంకెవరైనానా? అది మీరేనా, వేరెవరూ కాదు కదా? 108 మాల అని వ్యక్తులు కూడా అంటారు కానీ బాప్ దాదా మెడలో డైమండ్లు అయిన మీ అందరిదీ ఎంత పెద్ద మాల ఉంది? కేవలం 108 అంటే కింద కూర్చున్న వారు సరిపోతారు. వెనుక ఉన్నవారు కూడా ఉన్నారు కదా? మొదట వెనుక ఉన్నవారే. బాప్ దాదా వెనుక ఉన్నవారికి ఎక్కువ శుభాకాంక్షలను ఇస్తున్నారు, ఇది కూడా త్యాగానికి ప్రత్యక్ష ఫలము. కింద ఉన్నవారికి ఇంకా ఎక్కువ శుభాకాంక్షలు.

బాప్ దాదా పిల్లలు ప్రతి ఒక్కరి విశేషతను చూస్తారు. సంపూర్ణంగా అవ్వకపోయినా, పురుషార్థులుగా ఉన్నా కానీ, ఏ విశేషతా లేనటువంటి బాబా పిల్లలు ఒక్కరు కూడా లేరు. అందరిలోనూ విశేషతలు ఉన్నాయి. అన్నింటికన్నా మొదటి విశేషత ఏమిటంటే - కోట్లలో కొందరు అనే లిస్టులోనైతే ఉన్నారు కదా. ఇంకొక విశేషత ఏమిటంటే - పెద్ద-పెద్ద తపస్వీ మహాన్ ఆత్మలైనా, 16108 జగద్గురువు అయినా, శాస్త్రవాదులైనా, మహా మండలేశ్వరులైనా, వారు తండ్రిని తెలుసుకోలేదు, కానీ తండ్రి పిల్లలైన మీరందరూ తండ్రిని తెలుసుకున్నారు కదా. మరి తండ్రిని తెలుసుకోవటము అంటే, ఇది ఎంత పెద్ద విశేషత. హృదయపూర్వకంగా 'నా బాబా' అనైతే అంటారు కదా. 'నా వారు' అని అంటూ యజమానులుగానైతే అయ్యారు కదా. మరి దీనిని ఏమంటారు? ఎవరైతే తండ్రిని గ్రహించారో, గుర్తించారో, మరి గుర్తించటము అంటే ఇది కూడా బుద్ధి యొక్క విశేషత, పరిశీలించే శక్తి ఉంది. కావున మీ అందరి పరిశీలనా శక్తి శ్రేష్ఠంగా ఉంది. అచ్ఛా, ఈ రోజు విశేషంగా జరుపుకోవటానికి వచ్చారు కదా? ఈ రోజు జరుపుకునే రోజా లేక ఈ రోజు కూడా వినేటువంటి రోజా? వినాలి కూడానా? అచ్ఛా!

శివరాత్రి అని అంటారు, కానీ మీ కొరకు ఇప్పుడు ఇది ఏమిటి? మీ కొరకు ఇది రాత్రి కాదు అంటే మరి ఇంకేమిటి? అమృతవేళనా? మీరందరూ రాత్రి నుండి బయటపడ్డారా లేక ఇప్పుడు కూడా కొద్దికొద్దిగా రాత్రి ఉందా? అది సెలవు తీసుకుని వెళ్ళిపోయిందా? ఏ రకమైన అంధకారమైనా వస్తుందా లేక సమాప్తమైపోయిందా? అమృతవేళ సదా వరదానీ

సమయము, మరి మీకు రోజు వరదానాలు లభిస్తున్నాయి కదా? తండ్రి రాత్రివేళలో వస్తారు అని మీరు అంటారు, కానీ మనకైతే ఇది అమృతవేళ గోల్డెన్ మార్నింగ్, డైమండ్ మార్నింగ్. మరి మీ ఈ వరదానీ స్వరూపాన్ని చూసుకుంటున్నారా? మాయ మీ వరదానాలను మరపింపజేయటం లేదు కదా? మాయ వస్తుందా? అప్పుడప్పుడు అయితే వస్తుంది కదా? మాయ అయితే అంతిమ ఘడియ వరకు వస్తుంది. ఊరికే వెళ్ళిపోదు. కానీ మాయ పని రావటం మరియు మీ పని దూరం నుండే దానిని పారద్రోలటము. మాయ వచ్చిన తర్వాత దానిని పారద్రోలటము, ఇలా కాదు. ఆ సమయం ఇప్పుడు సమాప్తం అయిపోయింది. మాయ వచ్చింది, మిమ్మల్ని కదిలించింది, ఆ తర్వాత మీరు దానిని పారద్రోలటము అంటే సమయమైతే పోయింది కదా! కానీ సైలెన్స్ యొక్క సాధనాల ద్వారా మీరు దూరం నుండే - ఇది మాయ అని గ్రహించగలుగుతారు. ఇందులో కూడా సమయాన్ని వృథా చేసుకోకండి మరియు మాయ కూడా - పోనిలే, రావడమైతే రానిస్తున్నారు కదా అని చూస్తుంది. అలా రావటమనేది అలవాటైపోతుంది. ఏ విధంగా ఏదైనా పశువుకు లేక జంతువుకు మీ ఇంటికి వచ్చే అలవాటు చేసారు, ఆ తర్వాత విసిగిపోయి దానిని పారద్రోలారు, కానీ దానికి అలవాటైతే అయిపోయింది కదా! కొంతమంది పిల్లలైతే మాయకు నీళ్ళు, టీ కూడా ఇస్తారు అని తండ్రి వినిపించారు. ఏ నీళ్ళు, టీ తాగిస్తున్నారు? తెలుసా? ఏం చెయ్యను, ఎలా చెయ్యను, ఇప్పుడింకా పురుషార్థులమే, ఇప్పటికీ సంపూర్ణంగా అవ్వలేదు, చివరకు అయిపోతాములే - ఈ సంకల్పాలు నీళ్ళు, టీ వంటివి. కావున నీళ్ళు, టీ అయితే లభిస్తున్నాయి కదా అని మాయ చూస్తుంది. ఎవరికైనా ఒకవేళ నీళ్ళు, టీ ఇస్తే, వారు వెళ్ళిపోతారా లేక కూర్చుండిపోతారా? కావున ఎప్పుడైనా ఏదైనా పరిస్థితి వచ్చిందంటే - ఎందుకు, ఏమిటి, ఎలా, అప్పుడప్పుడు అయితే అవుతూనే ఉంటుంది, ఇప్పుడింకా ఎవరు పాస్ అయ్యారు, అందరి దగ్గర ఉంది కదా అని అనటం - ఇదే మాయకు ఆతిథ్యాన్ని ఇవ్వటము. కొంచెం స్వీట్, కొంచెం హాట్ కూడా తినిపిస్తారు. ఆ తర్వాత ఏం చేస్తారు? విసిగిపోయి - బాబా, మీరే పారద్రోలేయండి అని అంటారు. రానివ్వడం మీరు రానిస్తారు కానీ పారద్రోలడం అనేది బాబా చేయాలా, ఎందుకు? అసలు ఎందుకు రానిస్తారు? మాయ పదే-పదే ఎందుకు వస్తుంది? ప్రతి సమయము, ప్రతి కర్మ చేస్తూ, త్రికాలదర్శి సీట్పై సెట్ అవ్వరు. త్రికాలదర్శి అనగా భూత, భవిష్యత్, వర్తమానాల గురించి తెలిసినవారు. అప్పుడు ఏమిటి, ఎందుకు అని అనవలసిన అవసరం ఉండదు. త్రికాలదర్శులైన కారణంగా ముందు నుండే - ఈ విషయాలైతే రావలసిందే, జరగవలసిందే, స్వయం ద్వారానైనా, ఇతరుల ద్వారానైనా, మాయ ద్వారానైనా, ప్రకృతి ద్వారానైనా, అన్ని రకాలుగా పరిస్థితులైతే వస్తాయి, అవి రావాల్సిందే అన్నది తెలుసుకుంటారు. కానీ స్వ స్థితి శక్తిశాలిగా ఉన్నట్లయితే పరిస్థితి దాని ముందు అసలు ఏమీ కాదు. పరిస్థితి పెద్దదా లేక స్వ స్థితి పెద్దదా? లేక అప్పుడప్పుడు స్వ స్థితి పెద్దగా, అప్పుడప్పుడు పరిస్థితి పెద్దగా అవుతుందా? మరి దీనికి సాధనము - ఒకటేమో అదిమధ్యాంతాలు, మూడు కాలాలను చెక్ చేసుకుని, అర్థం చేసుకుని అప్పుడు ఏదైనా చెయ్యండి. కేవలం వర్తమానాన్ని చూడకండి. కేవలం వర్తమానాన్నే చూస్తే, ఒక్కోసారి పరిస్థితి పెద్దగా అనిపిస్తుంది మరియు ఒక్కోసారి స్వ స్థితి పెద్దగా అనిపిస్తుంది. ప్రపంచంలో కూడా - మొదట ఆలోచించండి, ఆ తర్వాత చేయండి అని అంటారు. ఒకవేళ దేనినైనా ఆలోచించి చేయకపోతే, తర్వాత ఆలోచించడము అనేది పశ్చాత్తాప రూపంగా అవుతుంది. అలా చేసుండేవారము కాదు, ఇలా చేసేవారము అని అనుకుంటారు, కనుక తరువాత ఆలోచించడము అనగా పశ్చాత్తాప రూపము మరియు ముందే ఆలోచించటము అనేది జ్ఞానీ ఆత్మల గుణము. ద్వాపర-కలియుగాలలోనైతే అనేక రకాలుగా పశ్చాత్తాపపడుతూనే ఉన్నారు కదా? కానీ ఇప్పుడు సంగమంలో పశ్చాత్తాపపడటం అంటే జ్ఞానీ ఆత్మలు కారు అని అర్థము. మిమ్మల్ని మీరు ఎలా తయారుచేసుకోవాలంటే - మీలో మీరు, మనస్సులో ఒక్క సెకెండు కూడా పశ్చాత్తాపపడకూడదు.

మరి ఈ డైమండ్ జూబ్లీలో విశేషంగా రోజంతటిలో - ఒకటి సమయము మరియు రెండు సంకల్పాలు - ఈ రెండు ఖజానాలపై అటెన్షన్ పెట్టండి. ఆ మాటకొస్తే ఖజానాలైతే చాలానే ఉన్నాయి కానీ - ప్రతి రోజు శ్రేష్ఠమైన, శుభమైన సంకల్పాలను ఎంత జమ చేసుకున్నాను? అని విశేషంగా ఈ రెండు ఖజానాలపై అటెన్షన్ పెట్టండి. ఎందుకంటే మొత్తం కల్పం కొరకు జమ చేసుకునే బ్యాంకు ఇప్పుడే తెరుచుకుంటుంది. సత్యయుగంలో ఈ జమ చేసుకునే బ్యాంకు మూసివేయబడుతుంది. ఈ బ్యాంకు కూడా ఉండదు, వేరే బ్యాంకు కూడా ఉండదు. మీ వద్ద ఎంత ధనం ఉంటుందంటే, ఎవరి దగ్గర నుండి ఏమీ తీసుకునే అవసరముండదు. బ్యాంకులో ఎందుకు పెట్టుకుంటారు? ఒకటేమో రక్షణ కోసము మరియు రెండవది వడ్డీ లభిస్తుంది. చాలా మంది ఎంత తెలివైనవారిగా ఉంటారంటే కేవలం వడ్డీతోనే గడుపుతూ ఉంటారు. మరి ఈ సమయంలో ఒకవేళ ఇంత తెలివైనవారిగా ఉన్నారంటే మంచిదే, జమ అయితే చేసుకుంటున్నారు కదా. కానీ వడ్డీని ఎటువైపు వినియోగిస్తారు అనేది చూడాలి. సత్యయుగంలో ఈ బ్యాంకు కూడా ఉండదు, ఆత్మిక సంపాదనను జమ చేసుకునే బ్యాంకు కూడా ఉండదు. రెండు బ్యాంకులూ ఉండవు. ఈ సమయంలో ఒకటికి పదమాల రెట్లు చేసి ఇచ్చేటువంటి బ్యాంకు ఉంది, కానీ ఒకటి జమ చేసుకుంటే అప్పుడు పదమాలు లభిస్తాయి, ఊరికే కాదు.

లెక్క ఉంది. డైమండ్ జూబ్లీలో సత్యమైన డైమండ్ గా అవ్వవలసిందే, ఇందులో దృఢంగా ఉన్నారు కదా? లేదా ఎప్పుడైనా అవ్వగలమో లేదో అని సంకల్పం వస్తుందా? ఏమో తెలియదు, అన్న సంకల్పమైతే రావటం లేదు కదా? ఏమి జరిగినా, త్యాగం చేయాల్సి వచ్చినా, తపస్య చేయాల్సి వచ్చినా, నమ్రచిత్తులుగా ఉండాల్సి వచ్చినా, ఏది ఏమైనా కానీ, తప్పకుండా తయారవ్వాలి. అలా తయారవ్వాలా? చెప్పండి, హాజీ నా లేక నాజీ నా? (హాజీ) చూడండి, హాజీ అని అనటము చాలా సహజము. కానీ ఆ విధంగా తయారవ్వటంపై అటెన్షన్ పెట్టాల్సి ఉంటుంది. మొట్టమొదటగా ఈ 'నేను' అన్న మాటను త్యాగం చేయాలి. ఈ 'నేను' అన్న మాట చాలా పాతది కానీ ఈ రోజుల్లో దీని రూపం చాలా రాయల్ గా అయ్యింది. భాషలో కూడా ఈ 'నేను' అన్న మాట సమాప్తమై 'బాబా-బాబా' అన్న మాట రావాలి. పలకడానికి ఇది సాధారణమైన మాటే. నేను యోగ్యుడిని కదా, మరి యోగ్యుడిని అన్నప్పుడు సౌకర్యాలు మరియు సేవ అదే విధంగా లభించాలి. నేను యోగ్యుడిని, నేను చేస్తున్నాను - ఇది రైటేనా? చేస్తున్నారు కదా, మరి నేను చేస్తున్నాను అని ఎందుకు అనకూడదు! నేను రాంగ్, నేను రైట్, అనడమైతే నేను చేస్తున్నాను... అనే అంటారు కదా! మీరు చెయ్యటం లేదా? చేసేది బాబా! ఆ తండ్రి చేయించేవారు కానీ చేసేది మీరే కదా. మరి 'నేను' అని అనటం తప్పు ఎందుకు అయ్యింది? ఆ మాటకొస్తే 'నేను' అన్న మాటను ఉపయోగిస్తారు కానీ వాస్తవానికి 'నేను' అన్న మాట ఎవరికి వర్తిస్తుంది? ఆత్మకా లేక శరీరానికా? నేను అంటే ఎవరు? ఆత్మ కదా, శరీరమైతే కాదు కదా? ఒకవేళ దేహీ-అభిమానులుగా అయ్యి, నేను ఆత్మను - అన్న ఈ స్మృతితో 'నేను' అన్న మాటను ఉపయోగిస్తే అది రైట్. కానీ ఒకవేళ దేహాభిమాన రూపంలో 'నేను' అని ఉపయోగిస్తే అది రాంగ్. మొత్తం రోజంతటిలో ఈ 'నేను' అన్న మాట చాలా సార్లు వస్తుంది మరియు అది వచ్చేదే ఉంది. అందుకే ప్రాక్టీస్ చేయండి - ఎప్పుడైతే 'నేను' అని అంటారో, అప్పుడు నేను అంటే ఎవరు? వాస్తవానికి 'నేను' అంటేనే ఆత్మ. శరీరాన్ని 'నాది' అని అంటారు. కనుక ఒకవేళ 'నేను' అన్న మాటను ఆత్మాభిమానిగా అయ్యి ఉపయోగించినట్లయితే ఆత్మకు స్వతహాగానే తండ్రి గుర్తుంటారు. చెప్పవలసిన అవసరం కూడా ఉండదు. నేను ఉన్నానే ఆత్మను - ఈ ప్రాక్టీస్ చెయ్యండి. 'నేను' అని అన్నప్పుడు మీ నామ-రూపాలు గుర్తు రావడం మీకు వ్యతిరేకంగా అలవాటైంది మరియు సహజం అయిపోయింది. నేను అంటే ఎవరు? నేను ఫలానా. ఇది సహజం అయిపోయింది కదా? ఆలోచించాల్సిన అవసరముండదు. ఇలా వ్యతిరేక భావంతో 'నేను' అన్న మాటను ఉపయోగిస్తున్నారు కావుననే రిజల్టులో శ్రమ ఎక్కువ మరియు ప్రాప్తి తక్కువ ఉంటుంది. చాలా మంది పిల్లలు - మేమైతే చాలా సేవ చేస్తున్నాము, చాలా కృషి చేస్తున్నాము కానీ ప్రాప్తి అంతగా లభించటం లేదు అని అంటారు. దానికి కారణం ఏమిటి? వరదానము అందరికీ ఒక్కటే, 60 సంవత్సరాల వారికైనా ఒకటే లేక ఒక నెల వారికైనా ఒకటే. ఖజానాలు అందరి వద్ద ఒకే విధంగా ఉన్నాయి. పాలన అందరికీ ఒకే విధంగా ఉంది, దినచర్య, మర్యాదలు అందరికీ ఒకేలా ఉన్నాయి. వేర్వేరుగా అయితే లేవు కదా! విదేశాలలో మర్యాదలు వేరు, భారత్ లో వేరు, అలాగైతే లేవు కదా? కొంచెం-కొంచెం తేడా ఉందా? లేదా? మరి అన్నీ ఒకటే అయినప్పుడు కొందరికి సఫలత లభిస్తుంది, కొందరికి తక్కువగా లభిస్తుంది - ఎందుకు? కారణమేమిటి? తండ్రి ఏమైనా తక్కువగా సహాయం చేస్తారా ఏమిటి? కొందరికి ఎక్కువ సహాయం చేయడం, కొందరికి తక్కువ, ఇలా ఉందా? లేదు. మరి ఇలా ఎందుకు అవుతుంది? దీని అర్థం ఏమిటి? మీ పొరపాటు ఉంది. అయితే దేహాభిమానము అనే 'నేను' వస్తుంది, లేదా ఒక్కోసారి తోటి వారి సఫలతను చూసి ఈర్ష్య కూడా వస్తుంది. ఆ ఈర్ష్య కారణంగా ఏ సేవనైతే హృదయపూర్వకంగా చేయాలో, దానిని బుద్ధితో చేస్తారు, హృదయపూర్వకంగా చేయరు. హృదయపూర్వకంగా చేసిన సేవకే ఫలం లభిస్తుంది. ఎన్నో సార్లు పిల్లలు బుద్ధిని ఉపయోగిస్తారు కానీ మనస్సు మరియు బుద్ధి, ఈ రెండింటినీ కలిపి చేయడం లేదు. బుద్ధి లభించింది, దానిని కార్యంలో ఉపయోగించటం మంచిదే కానీ కేవలం బుద్ధిని మాత్రమే కాదు. ఎవరైతే హృదయపూర్వకంగా చేస్తారో, అటువంటివారి హృదయంలో తండ్రి స్మృతి కూడా సదా ఉంటుంది. కేవలం బుద్ధితో చేస్తే - అవును, బాబాయే చేయించేవారు, అవును బాబాయే చేయించేవారు అని కొద్దిసేపు బుద్ధిలో గుర్తుంటుంది, కానీ కొద్ది సమయం తర్వాత మళ్ళీ అది 'నేను' అన్న భావం వచ్చేస్తుంది, అందుకే మనసు మరియు బుద్ధి, రెండింటి బ్యాలెన్స్ పెట్టండి.

మరి వినిపించాము కదా - డైమండ్ జూబ్లీలో ఏం చేయాలి? విశేషంగా పొదుపు ఖాతాను జమ చేసుకోండి. మొత్తం రోజంతటిలో నా ద్వారా అటువంటిదేమీ జరగలేదు కదా, ఎవరికీ దుఃఖాన్ని అయితే ఇవ్వలేదు కదా, ఎవరితో ఎటువంటి గొడవ జరగలేదు కదా అనగా పోగొట్టుకోలేదు కదా. పోగొట్టుకోలేదు, మంచిదే కానీ జమ చేసుకున్నారా? సేవ కూడా చేసారు కానీ మీ ఆత్మికతతో సేవలో సఫలతను పొందారా? లేదా సఫలతను జమ చేసుకున్నారా? సేవకు సమయాన్ని కేటాయించారు - ఇది మంచిదే కానీ ఏ విధితో సేవ చేసారు? మేము రోజంతా ఎంతగా సేవలో బిజీ ఉంటామంటే మాకు మా గురించే తెలియదు అని చాలా మంది అంటారు. బిజీగా ఉంటున్నారు, ఇది చాలా మంచిది. కానీ సేవ యొక్క ప్రత్యక్ష ఫలం జమ అయ్యిందా? లేక కేవలం శ్రమించారా? సేవలో 8 గంటల సమయాన్ని కేటాయించారు కానీ 8

గంటలూ సేవలో జమ అయ్యాయా? సమయం జమ అయ్యిందా? లేక సగం జమ అయ్యి, సగం పరుగెత్తడంలో, ఆలోచించటంలో పోయిందా? శ్రేష్ఠ సంకల్పాలు, శుభ భావన, శుభ కామనలతో కూడిన సంకల్పాలు జమ అవుతాయి. కనుక మొత్తం రోజంతటిలో జమ ఖాతాను నోట్ చేసుకోండి. జమ ఖాతా పెరుగుతూ ఉన్నప్పుడు స్వతహాగా డైమండ్ గా అవ్వవలసిందే. ఇప్పటికీ సమయము మరియు సంకల్పాలు - మంచిగానూ ఉండటం లేదు, చెడుగానూ ఉండటం లేదు. చెడుగా లేదంటే మీరు రక్షించబడ్డారు కానీ మంచిలో జమ అయ్యాయా? అర్థమైందా? సమయాన్ని, సంకల్పాలను పొదుపు చెయ్యండి, ఇప్పుడు ఎంతగా పొదుపు చేస్తారో, జమ చేస్తారో, అంతగా మొత్తం కల్పంలో దాని అనుసారంగా రాజ్యం కూడా చేస్తారు మరియు పూజ్యులుగా కూడా అవుతారు. ద్వాపరం నుండి మీరు సాకార రూపంలో పడిపోయే కళలోకి వస్తారు కానీ మీరు జమ చేసుకున్న ఖాతా మీ జడ చిత్రాలకు పూజ చేయిస్తుంది. కనుక ఇదంతా నోట్ చేసుకున్నట్లయితే, ఎంత సమయం వృధాగా లేక సాధారణంగా గడిచింది అనేది అర్థమవుతుంది? సాధారణ సంకల్పాలు ఎన్ని ఉంటున్నాయి అన్నది తెలుస్తుంది. కానీ ఒక దాని పట్ల అటెన్షన్ పెట్టాలి - ఒకవేళ ఈ రోజు మీ జమ ఖాతా చాలా తక్కువ ఉంది అనుకోండి, తక్కువగా ఉండడాన్ని చూసి మీరు నిరాశపడకండి. ఇప్పటికీ మాకు జమ చేసుకోవటానికి అవకాశం ఉంది అని భావించండి. స్వయాన్ని ఉల్లాస-ఉత్సాహాలలోకి తీసుకురండి. మీతో మీరు రేస్ చేయండి, ఇతరులతో కాదు. ఈ రోజు 8 గంటలు జమ అయితే రేపు 10 గంటలు జమ అవ్వాలి అని మీతో మీరు రేస్ చేసుకోండి, ఇందులో నిరాశపడకండి ఎందుకంటే ఇప్పుడింకా జమ చేసుకునేందుకు సమయం మిగిలి ఉంది. టూ లేట్ బోర్డు ఇంకా పెట్టలేదు. ఫైనల్ రిజల్టు యొక్క సమయాన్ని ఇప్పుడింకా అనౌన్స్ చేయలేదు. ఏ విధంగా లౌకికంలో కూడా పరీక్ష తేదీ ఫైనల్ అయినప్పుడు మంచి పురుషార్థులు ఏం చేస్తారు? నిరాశపడతారా లేక పురుషార్థంలో ముందుకు వెళ్తారా? అలాగే మీరు కూడా నిరాశపడకండి. మరింత ఉల్లాస-ఉత్సాహాలలోకి వచ్చి దృఢ సంకల్పం చేయండి - నేను నా జమ ఖాతాను పెంచుకోవాల్సిందే. అర్థమైందా? అచ్ఛా!

నలువైపులా ఉన్న జయంతి శుభాకాంక్షలను తెలిపే పిల్లలకు, సదా తండ్రితో పాటు ఉండే కంబైండ్ రూపధారీ పిల్లలకు, సదా ఉల్లాస-ఉత్సాహాల ద్వారా స్వయాన్ని మరియు ఇతరులను ముందుకు తీసుకువెళ్ళే పిల్లలకు, నలువైపులా సేవలలో ఉన్నతిలోకి వెళ్ళే సత్యమైన సేవాధారీ పిల్లలకు బాప్ దాదాల పదమా-పదమా-పదమాల రెట్ల శుభాకాంక్షలు. ప్రియస్మృతులతో పాటు తండ్రి కూడా పిల్లల యొక్క శుభాకాంక్షలను, ప్రియస్మృతులను స్వీకరిస్తున్నారు. అన్ని వైపులా శుభాకాంక్షలు-శుభాకాంక్షలు అని మనసులోని పాటలు మ్రోగుతూ ఉండడాన్ని చూస్తున్నారు. మరి అలా శుభాకాంక్షలను తీసుకోవటము మరియు శుభాకాంక్షలను ఇవ్వటము, ఈ రెండింటి సంగమానికి విశేషమైన ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- ప్రతి విషయంలోనూ కళ్యాణము ఉంది అని భావిస్తూ అచలమైన, స్థిరమైన మహావీరులుగా అయ్యే త్రికాలదర్శీ భవ

ఏ విషయాన్ని ఏక కాల దృష్టితో చూడకండి, త్రికాలదర్శిగా అయి చూడండి. ఎందుకు, ఏమిటి అని అనేందుకు బదులుగా సదా ఇదే సంకల్పము ఉండాలి - ఏదైతే జరుగుతోందో అందులో కళ్యాణము ఉంది. బాబా ఏది చెప్తే అది చేస్తూ వెళ్ళండి, ఇక ఆ తరువాత దాని గురించి బాబాకు తెలుసు, బాబా కార్యానికి తెలుసు. బాబా ఎలా నడిపిస్తే అలా నడవండి, అప్పుడు అందులో కళ్యాణము నిండి ఉంటుంది. ఈ నిశ్చయం వలన ఎప్పుడూ అలజడి చెందరు. సంకల్పము మరియు స్వప్నంలో కూడా వ్యర్థ సంకల్పాలు రాకూడదు, అప్పుడే అచలమైన, స్థిరమైన మహావీరులు అని అంటారు.

స్లోగన్:- ఎవరైతే శ్రీమతము యొక్క సూచన అనుసారంగా క్షణంలో అతీతంగా మరియు ప్రియంగా అవుతారో, వారే తపస్వీలు.